క్లుప్తంగా

'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా బైక్‌ర్యాలీ



నినాదాలు చేస్తున్న నాయకులు

నర్సంపేట : ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు చేయడానికి మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో చెన్నారావుపేటలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, భారత్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల రాజశేఖర్ మాట్లాడారు. ఉగ్రవాద స్థావరాలపై సైన్యం దాడి పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కీసరి సాంబరాజు, ఉపాధ్యక్షుడు కందాల చంద్రమౌళి, నాయకులు వనపర్తి మల్లయ్య, వీరేంద్రనాథ్, ఈదునూరి విజయ్‌కుమార్‌రెడ్డి, కోరె రాకేశ్, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు



నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో ఉత్తరాషాడ నక్షత్ర సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం అభిషేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. అయ్యప్ప జన్మ నక్షత్రంగా భావించి భక్తులు కుటుంబ సమేతంగా అభిషేక పూజలు చేశారు. కార్యక్రమంలో పడి పూజ దాత పబ్బా సుజన శ్రీనివాస్, సైఫా సురేశ్, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, బండారుపల్లి చెంచారావు, చకిలం కృష్ణమూర్తి, పాలకుర్తి శ్రీనివాస్, దొడ్డ వేణు, తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



వర్ధన్నపేట : పట్టణంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహేంద్రస్వామి 332వ ఆరాధనోత్సవం నిర్వహించారు. ఆలయంలో ఉత్సవ విగ్రహాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో పురవీధుల్లో వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ఊరేగించారు.

టీషర్టుల అందజేత




రాయపర్తి : మండలంలోని మొరిపిరాలలో హమాలీలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సమకూర్చిన టీషర్టులను బీఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి తాళ్లపల్లి సంతోశ్ గౌడ్ గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్మికులు టీషర్టులు అందించినట్టు తెలిపారు. సామాజిక సేవలే ధ్యేయంగా ఫౌండేషన్ ముందుకు సాగుతోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అనిరెడ్డి యాకూబ్‌రెడ్డి, చేగూరి మల్లేశ్, బొమ్మెర మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఇటికాల రవి ఇటీవల ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందగా బాధిత కుటుంబానికి ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు భూక్యా గణేశ్ ఆధ్వర్యంలో గురువారం రూ.5,500 నగదుతోపాటు 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అక్బర్, మహేశ్, చిట్టి స్వామి, ప్రశాంత్, అజీమ్, రాజు, సంపత్, శ్రీకాంత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



సంగెం : మండలంలోని గవిచర్లకు చెందిన ఆగపాటి శ్రీనివాస్ (42) గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దొనికెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరికొయ్యలకు నిప్పు.. భూమికి ముప్పు

- భూమిలోని పోషకాలకు తీరని నష్టం

సంగెం : వరికొయ్యలకు నిప్పు పెడితే భూమికి ముప్పు తప్పదు. కొందరు రైతులు అవగాహనా రాహిత్యంతో వరికొయ్యలను, పంట అవశేషాలను దహనం చేస్తూ భూసారానికి తీరని నష్టం కలిగిస్తున్నారు. భూమిలో పోషకాలు తగ్గిపోయి దిగుబడిపై దుష్ప్రభావం పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పంటలకు మేలు చేసే నైట్రోజన్, పాస్ఫరస్, పొటాషియం వంటి పోషకాలు మంట వేడికి ఆవిరైపోతాయి.

మండలంలో 13960 హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో 2550 హెక్టార్లలో వరి సాగవుతోంది. రబీలో 6300 ఎకరాల్లో వరి సాగు చేశారు. రైతులు వరి కోతలకు యంత్రాలను ఉపయోగిస్తున్న క్రమంలో యంత్రాలు వరి కంకి మొదలు భాగంలో కాకుండా 30 సెంటీమీటర్ల ఎత్తులో కోస్తుండడంతో 50 శాతం గడ్డి కొయ్యల రూపంలో పొలంలోనే మిగిలిపోతోంది. దీంతో కొందరు రైతులు వరికొయ్యలను దహనం చేస్తున్నారు. వరికొయ్యల దహనం కారణంగా టన్నుకు 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్‌తోపాటు 1400 కిలోల కార్బన్ డయాక్సైడ్ గాలిలోకి విడుదలై తీవ్ర వాయు కాలుష్యానికి దారి తీస్తుంది. వరికొయ్యలతోపాటుగా యంత్రాలతో కోసిన వరిగడ్డిని సైతం కొందరు రైతులు తొలగించలేక నిప్పు పెడుతున్నారు.



దహనమవుతున్న వరికొయ్యలు (ఫైల్)

వ్యర్థాలను కలియదున్నాలి



వరికొయ్యలు.. మొక్కజొన్న, పత్తి కట్టె అవశేషాలను దహనం చేస్తే భూసారానికి నష్టం తప్పదు. పంటల దిగుబడి తగ్గుతుంది. వాయు కాలుష్యం చోటు చేసుకుని ప్రజారోగ్యానికి దెబ్బ పడుతుంది. భూమి వేడెక్కడానికి ప్రధాన కారణమైన కార్బన్ డయాక్సైడ్ శాతం తగ్గించాలన్నా, నేలలో కర్బన శాతం పెరగాలన్నా వ్యవసాయ ఉత్పత్తుల వ్యర్థాలకు నిప్పు పెట్టొద్దు. దుక్కిలో కలియదున్నాలి.

- యాకయ్య, ఏఓ

వరికొయ్యల దహనంతో అనేక నష్టాలు

వరికొయ్యలను దహనం చేస్తుండడంతో అనేక నష్టాలున్నాయని అధికారులు చెబుతున్నారు. నత్రజని, భాస్వరం, పొటాషియం, తదితర పోషకాలు ఆవిరైపోతాయని తెలిపారు. భూమిలోని సూక్ష్మజీవులు నశించి భూమి సమతుల్యత కోల్పోతుందన్నారు. వాయు కాలుష్యం తలెత్తి ఊపిరితిత్తుల సంబంధిత ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని చెప్పారు. మట్టిలోని నీటి నిల్వ సామర్థ్యం తగ్గి పంటకు నీటి ఎద్దడి ఏర్పడి అధిక నీటి అవసరం అవుతుందని వివరించారు.

వరికొయ్యలను కలియదున్నడంతో లాభాలు

వరికొయ్యలను భూమిలో కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది. వరి కోత తర్వాత ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్ చల్లి నీటిని పెడితే కొయ్యలు కుళ్లిపోతాయి. తదనంతరం రోటోవేటర్‌తో కలియదున్నితే సల్ఫర్, భాస్వరం, తదితర పోషకాలు విడుదలై మొక్కల ఎదుగుదల దోహదపడతాయి. సేంద్రియ కర్బనం పెరగడమే కాకుండా దిగుబడి 8–10 శాతం పెరుగుతుందని పరిశోధనలు నిర్ధారించాయి. మట్టిలో జీవం పెరిగి ఉత్పాదకత మెరుగవడంతో రసాయక ఎరువులు వాడకం తగ్గి పెట్టుబడీ తగ్గుతుంది. వరికొయ్యలను మల్చింగ్‌గా వాడితే భూమి తేమ పెరిగి మొక్కకు అనుకూలంగా మారుతుంది.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఖానాపురం : నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న హరిబాబు, జగన్‌మోహన్‌రెడ్డి

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు

ఖానాపురం : అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బుధరావుపేట, పెద్దమ్మగడ్డ గ్రామాల్లో పలువురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా నిర్మాణ పనులను గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు దశలవారిగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యడ్ల భిక్షంరెడ్డి, ముస్తఫా, వేణుగోపాల్‌రావు, సాగర్‌రావు, ఎల్లగౌడ్, బిక్కి మురళీ, చాంద్‌పాషా, వెంకన్న, లాల్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : మాట్లాడుతున్న రమేశ్

చెన్నారావుపేటలో..

నర్సంపేట : చెన్నారావుపేటలో దూపటి సరళ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేశ్ యాదవ్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు పద్మ, మాజీ ఎంపీటీసీ కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా శ్రేణులు కృషి చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మండల కేంద్రంలోని తన నివాసంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశానికి దయాకర్‌రావు హాజరై మాట్లాడారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. కార్యకర్తలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వెలిబుచ్చారు. ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే కొనుగోలు చేసే దిక్కులేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అందాల పోటీలపై సమీక్ష చేస్తూ అన్నదాతల సమస్యలను విస్మరిస్తున్నాడని మండిపడ్డారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు అవసరమైన మేరకు గన్నీ బ్యాగులు ఇచ్చే పరిస్థితిలో లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో కరోనా వచ్చినా, ఎన్ని అవాంతరాలు ఎదురైనా రైతుబంధు ఆపలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తరుగు పేరుతో రైతులను నిండా ముంచుతోందన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్, మాజీ కార్పొరేటర్ చింతల యాదగిరి, సొసైటీ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, నాయకులు చింతపట్ల సోమేశ్వర్‌రావు, చిన్నపాక శ్రీనివాస్, మాడుగుల రాజు, ఏర్పుల శ్రీనివాస్, కొల్లూరు వెంకటేశ్వర్లు, మహేశ్, సోషల్ మీడియా మండల కన్వీనర్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సంగెం : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎల్.నరేశ్ కోరారు. మండలంలోని తిమ్మాపూర్‌లో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శన సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక అంశాలపై ప్రజలు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. ఆపద సమయాల్లో డయల్ 100, 1930 నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందాలని కోరారు. తొలుత గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు బానిసలు కావొద్దని, వాహన చోదకులు పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎస్సై అర్చన, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోండి

నర్సంపేట/పర్వతగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి తలపెట్టిన శిక్షణను అర్హులైన సర్వేయర్లు వినియోగించుకోవాలని చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల తహసీల్దార్లు ఫణికుమార్, వెంకటస్వామి గురువారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. భూ సంబంధిత సేవలు, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయనుందని పేర్కొన్నారు. రెవెన్యూ పరిపాలనకు ఊతమిచ్చేలా సర్వే, భూమి రికార్డుల విభాగంలో పని చేస్తున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సర్వేయర్లకు శిక్షణ అనంతరం జిల్లాలో నియామకాలుంటాయని వివరించారు. ఈనెల 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

'డ్రంకెన్ డ్రైవ్'లో ఒకరికి జైలు

నెక్కొండ : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష ఖరారైంది. ఎస్సై మహేందర్ వివరాలు వెల్లడించారు. ఈనెల 6న స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రంజిత్ అనే వ్యక్తి మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. రంజిత్‌పై పోలీసులు కేసు నమోదు చేసి నర్సంపేట కోర్టులో హాజరుపర్చగా మూడు రోజుల జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి లక్ష్మినారాయణ తీర్పు ఇచ్చారు. మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని ఎస్సై కోరారు.

క్రీడలతో వికాసం

రాయపర్తి : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని పీఈటీ పుట్ట సమ్మయ్య తెలిపారు. మండలంలోని కాట్రపల్లి ప్రభుత్వ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వేసవి శిబిరంలో ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వం క్రీడాంశాల్లో శిక్షణ ఏర్పాటు చేసిందన్నారు.

అర్హులకు పథకాలు అందించాలి

నెక్కొండ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస్, తదితర సంక్షేమ పథకాలు అందించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఈదునూరి యాకయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందించింది. అనంతరం యాకయ్య మాట్లాడారు. కొర్రీలతో పేదలకు పథకాలను దూరం చేసే ప్రయత్నాలు సరికాదన్నారు. సమావేశంలో నాయకులు మాతంగి రాజు, గంద్రకోటి నరేందర్, బొడ్డుపల్లి రాజు, ఈదునూరి శ్రీనాథ్, రేగుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో అధికారుల విచారణ



పెట్రోల్ బంక్‌లో విచారణ చేస్తున్న అధికారులు

రాయపర్తి : మండల కేంద్రంలోని వినాయక హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో సివిల్ సప్లయ్ శాఖ డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్, అధికారులు గురువారం విచారణ చేపట్టారు. పెట్రోల్ బంక్‌లో కల్తీ జరుగుతోందంటూ ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు సంకినేని వెంకట్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేసిన క్రమంలో అధికారులు విచారణ చేపట్టారు. డెన్సిటీ టెస్ట్ చేశామని, ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సేల్స్ మేనేజర్ వెంకటేశ్వర్లు, లీగల్ మెట్రాలజీ ఆఫీసర్ అజీజ్ పాషా, ఆర్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొరం తరలింపులో వివాదం

- అడ్డుకున్న 'కొండా' వర్గం

గీసుకొండ : మండలంలోని గీసుకొండ సమీపంలోని డీబీఎం–38 కెనాల్ వద్ద కాకతీయ ప్రధాన కాల్వ నుంచి భారీ వాహనాల ద్వారా చేపల చెరువు కోసం చేపట్టిన మొరం తరలింపు వివాదాస్పదంగా మారింది. ఈనెల 12వ తేదీ వరకు మొరం తరలించడానికి కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి పేరిట అనుమతి తీసుకుని తరలిస్తుండగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారంటూ కొండా వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వీరగోని రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలను గురువారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని చెప్పారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదన్నారు. ఆర్ఐలు సాంబయ్య, శ్రీధర్ పరిస్థితిని సమీక్షించారు. ఎస్సై ప్రశాంత్‌బాబు ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. నిబంధనల విషయమై స్పష్టత వచ్చే వరకు మొరం తరలింపును నిలిపేయాలని వాహనదారులను ఎస్సై ఆదేశించారు. కాకతీయ ప్రధాన కాల్వ హద్దు నిర్ణయించాలని, మొరం దందాపై ఇరిగేషన్ శాఖ మంత్రి సమీక్షించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు.



వాహనాన్ని అడ్డుకుంటున్న నాయకులు

నేడు సీఎస్ఐ చర్చి ప్రారంభం

- ఒకేసారి 500 మంది ప్రార్థన చేసుకునేలా..

నల్లబెల్లి : మండల కేంద్రంలోని సీఎస్ఐ పరిశుద్ధ తోమా దేవాలయం (చర్చి)ని బైబిల్ నియమాల ప్రకారం సువిశాలంగా నిర్మించారు. ప్రముఖ వైద్యుడి ఆర్థికసాయం.. సంఘ పెద్దల స్వచ్ఛంద భాగస్వామ్యం కలగలిసి ఏకకాలంలో సుమారు 500 మంది ప్రార్థన చేసుకోవడంతోపాటు ఆలయ ప్రాంగణంలో శుభకార్యాలు నిర్వహించుకునేలా వేదికనూ నిర్మించారు. సుమారు 30 గుంటల విస్తీర్ణంలో సీఎస్ఐ చర్చి నేడు ప్రారంభం కానుంది.

మండల కేంద్రంలో సుమారు 80 ఏళ్ల క్రితం సీఎస్ఐ పరిశుద్ధ తోమా దేవాలయాన్ని స్థానిక క్రైస్తవ మతస్తులు నిర్మించారు. కాలక్రమంలో ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఈ క్రమంలో సంఘ పెద్దలు నూతన భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. స్థానికుడైన ప్రముఖ వైద్యుడు సామ్యూల్‌ను సంప్రదించగా ఆయన తన తల్లిదండ్రులు నాగెల్లి కరుణమ్మ–రూబెన్ జ్ఞాపకార్థం చర్చి నిర్మాణానికి ఆర్థికసాయం అందించేందుకు ముందుకొచ్చారు. దీంతో డాక్టర్ సామ్యూల్ కుటుంబ సహకారంతో 2017లో ఆలయ నిర్మాణ పనులకు బిషప్ రెవరెండ్ డాక్టర్ రూబెన్ మార్క్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పునాది వేశారు. ఆలయాన్ని 8 వేల చదరపు అడుగుల సువిశాలం ప్రాంగణంగా తీర్చిదిద్దారు. ఒకేసారి 500 మంది ప్రార్థన చేసుకునేలా వసతులు కల్పించారు. ఆలయ నిర్మాణం పూర్తి కాగా నేడు(శుక్రవారం) బిషప్ రెవరెండ్ డాక్టర్ రూబెన్ మార్క్–రెవరెండ్ డాక్టర్ ప్రిస్సిల్లా పరిమిళ రూబెన్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ దిశగా పాస్టేట్ చైర్మన్ ఈసంపెల్లి ప్రసాద్, సెక్రటరీ నాగెల్లి ప్రకాశ్, ట్రెజరర్ కనుకం నవీన్, సంఘ పెద్దలు ఏర్పాట్లు చేశారు.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సీఎస్ఐ చర్చి

'ఓంకార్..' సభను విజయవంతం చేయాలి

- ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకుడు అరుణ్

రాయపర్తి : వరంగల్ జిల్లా పరిధిలోని మచ్చాపూర్‌లో ఈనెల 12న నిర్వహించనున్న మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శతజయంతి ఉత్సవాల సభను విజయవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకుడు అరుణ్‌నాయక్ కోరారు. ఉత్సవాల వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మచ్చాపూర్‌లోని ఓంకార్ స్తూపం వద్ద సాయంత్రం 4 గంటలకు శతజయంతి ఉత్సవాల ప్రారంభోత్సవ సభ ఉంటుందని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుగులోతు కోట్యానాయక్, గుగులోతు రాములు, గణేశ్, వీరన్న, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లో ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి కలకోట్ల యాదగిరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలు సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సామ్యూల్, నర్సయ్య, నర్సమ్మ, ఎల్లమ్మ, సుభద్ర పాల్గొన్నారు.

ఆరేళ్లలో ఆయిల్‌పామ్ దిగుబడి షురూ

- ఉద్యాన శాఖ డివిజన్ అధికారి తిరుపతి

గీసుకొండ : మరె ఆరేళ్లలో ఆయిల్‌పామ్ దిగుబడి మొదలవుతుందని ఉద్యాన శాఖ వరంగల్ డివిజన్ అధికారి తిరుపతి తెలిపారు. మండలంలోని ఎలుకుర్తి హవేలీలో రైతు నాయకోటి రవీందర్ సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలో రాంచరణ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తిరుపతి మాట్లాడారు. వేసవిలో రైతులు ఆయిల్ పామ్ తోటల పరిరక్షణ, ఎదుగుదల చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయిల్‌పామ్ టన్నుకు రూ.20 వేల ధర పలుకుతోందని చెప్పారు. ఆయిల్ పామ్ గెలలను చట్టప్రకారం కంపెనీలే కొనుగోలు చేస్తాయన్నారు. మొక్కల చుట్టూ మూడు వరుసల జనుము విత్తితే వేడిగాడ్పుల నుంచి రక్షణ ఉంటుందని చెపాపరు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ అనిల్ జైన్, కంపెనీ ప్రతినిధులు శివ, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.



నల్లబెల్లి : మాట్లాడుతున్న హెచ్ఓ జ్యోతి

నల్లబెల్లి : మండలంలోని కొండాయిల్‌పల్లిలో కొలగాని రామారావుకు చెందిన ఆయిల్‌పామ్ తోటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యాన శాఖ నర్సంపేట అధికారి జ్యోతి మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే అధిక లాభాలొస్తాయని చెప్పారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ కరుణాకర్, డ్రిప్ ప్రతినిధి చిరంజీవి, వీరారెడ్డి, లింగారెడ్డి, ముత్తారెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సుజాత వ్యాఖ్యలు సరికాదు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ

నర్సంపేట : ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేసిన దాడిపై సోషల్ మీడియా వేదికగా రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు డాక్టర్ మారెపల్లి సుజాత చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి అన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు ఏసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ ఎగతాళి చేసేలా సుజాత వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. ఆపరేషన్ సిందూర్‌కు దేశ వ్యాప్త మద్దతు లభిస్తుండగా దేశ సమగ్రతను దెబ్బతీసేలా సుజాత వ్యాఖ్యలు చేశారని అసహనం వ్యక్తం చేశారు. పర్యటకులపై ఉగ్రవాదులు మారణకాండ సాగించిన రోజు సుజాత స్పందించలేదన్నారు. సుజాతపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఎంను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గుణపాఠం చెబుతామన్నారు. సమావేశంలో ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు గూడూరు సందీప్, మండల అధ్యక్షుడు తనుగుల అంబేడ్కర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు, పార్లమెంటు కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు ఠాకూర్ రవీందర్‌సింగ్, కూనమల్ల పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాణిరుద్రమదేవి

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

- రైతు సంఘం సహాయ కార్యదర్శి శోభన్

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి తెలిపారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని గ్రీన్ రిసార్ట్స్‌లో వ్యకాస జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాలోతు సాగర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన జిల్లా సదస్సులో శోభన్, మాధవి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా సవరించిందని విమర్శించారు. సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సదస్సులో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు, వ్యకాస జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తున్న స్కూల్..?

వర్ధన్నపేట : పట్టణంలోని శ్రీ అరబిందో ఉన్నత పాఠశాల ఫేక్ ప్రకటనల ప్రచారంతో బురిడీ కొట్టిస్తోందని పలువురు తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. సదరు స్కూల్ ప్రచారంలో నిజమెంత అన్న చర్చ సాగుతోంది. వివరాలిలా.. స్థానిక అరబిందో హైస్కూల్ పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు, టాపర్లు ఉన్నారని ప్రకటన చేస్తూనే మరోవైపు శ్రీ చైతన్య పాఠశాల ద్వారా ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు కరపత్రాలు, పోస్టర్లతో ప్రచారం చేస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇందులోనూ ఓ జిమ్మిక్కు చేసినట్లు కొందరు తల్లిదండ్రులు తెలిపారు. మరో కరపత్రంలో 'శ్రీచైతన్య కరిక్యులమ్‌తో..' అని ప్రచారం చేస్తున్నట్టు తెలుస్తోంది. సదరు స్కూల్ శ్రీచైతన్య పాఠశాలా? లేక అరబిందో స్కూలా? అంటూ అనుమానం వ్యక్తం అవుతుండడంతో ఎంఈఓ శ్రీధర్‌ను వివరణ కోరగా అరబిందో పాఠశాలగా ఆయన నిర్ధారించారు. కరపత్రాలు, పోస్టర్ల ద్వారా 'శ్రీచైతన్య..' అని ప్రచారం చేస్తున్న విషయమై ఆయన మాట్లాడుతూ విచారణ చేపడతామన్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్టు నిరూపణ అయితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గీసుకొండ : మహిళలు, బాలికలకు రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలని సఖి సెంటర్ కేస్ వర్కర్ తిరుమల, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి సుష్మ, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఔట్ రీచ్ వర్కర్ శ్వేత తెలిపారు. మండలంలోని హరిజ్యతండాతోపాటు కొనాయమాకులలోని ప్రగతి మండల సమాఖ్యలో జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, వరంగల్ సఖి సెంటర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు అనేక చట్టాలున్నాయని చెప్పారు. సఖి కేంద్రాల ద్వారా బాధిత మహిళలకు, బాలికలకు పోలీసు, లీగల్, వైద్య, ఇతర సాయం అందుతాయని వివరించారు. ఆపద కాలంలో మహిళలు 181 హెల్ప్‌లైన్, వృద్ధులు 14567 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం హెల్ప్‌లైన్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎం సురేశ్, సీసీ గడ్డి అశోక్, తదితరులు పాల్గొన్నారు.